





• రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్

• నగరంలో మాట్లాడుతున్న కేసీఆర్

నేను చచ్చేంత వరకూ జిల్లాను మర్చిపోను

- నిజామాబాద్ జిల్లా నాకు ఊపిరినిచ్చింది
- పార్టీ పెట్టగానే ప్రజలు జడ్పీని గెలిపించారు
- కాంగ్రెస్, బీజేపీ నేతలు చెప్పేది నమ్మొద్దు
- బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

నిజామాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నిజామాబాద్ జిల్లా నాకు ఊపిరి పోసింది. పార్టీని నెంబర్ వన్‌గా నిలబెట్టింది.. నేను చచ్చేంత వరకూ జిల్లాను మర్చిపోను' అని మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ అన్నారు. నగరంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఒకప్పుడు బంగారంలాగా ఉండేదన్నారు. అరవై ఏళ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో జిల్లాను నిండా ముంచారని అన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులను పట్టించుకోలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకువచ్చామన్నారు. మల్లన్నసాగర్ లిఫ్ట్ ద్వారా ప్రాజెక్టుకు నీటిని మళ్లించామన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కోసం పునరుజ్జీవ పథకాన్ని తీసుకువచ్చి పూర్తి చేశామన్నారు. వరద కాలువను రిజర్వాయర్‌గా చేసుకొని రైతులకు నీరు అందించామన్నారు. పదేళ్ల పాలనలో రైతులకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. ప్రస్తుతం ఈ ఐదు నెలల్లో ఎమైందో మీరంతా ఆలోచించుకోవాలని ఆయన అన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో కరెంటు కోతలు లేవు

బీఆర్‌ఎస్ పాలనలో కరెంటు కోతలు లేవని రైతులకు ఉచితంగానే విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతుల ధాన్యం కొనుగోలుతో పాటు క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేశాడన్నారు. కా నీ సం

వడ్లకు పాత ధర కూడా ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు. ఏ రైతుకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు రైతుబంధును అందించామన్నారు. ఈ ఐదు నెలల పాలనలోనే రైతులకు పూర్తిస్థాయిలో రైతుబంధు ఇవ్వలేదన్నారు. తాను రోడ్డు మీదకు వచ్చి ప్రచారం మొదలుపెట్టగానే ప్రస్తుతం మళ్లీ రైతుబంధు అమలు పెట్టారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో నిజామాబాద్ జిల్లాకు నీటి ఇబ్బంది లేకుండా చేశామన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్ అందించామన్నారు. ఈ ఐదు నెలల కాలంలో కాంగ్రెస్‌లో ఏమి చేశారని ఆయన ప్రశ్నించారు. తాను బయటకి వస్తేనే అన్ని పనులు చేస్తున్నారన్నారు. తాను కాలు విరిగిన రోడ్‌మీదకు వచ్చి లొల్లి పెడుతున్నాను కాబట్టే పనులు చేస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి బీజేపీ ఎంపీని గెలి పించిన ఫలితం లేదన్నారు. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని జిల్లా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీకి లొంగకపోవడం వల్లనే తన బిడ్డ కవితను అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. తాను లొంగేది లేదని పోరాడుతూనే ఉంటానని జిల్లా ప్రజలు పార్టీకి పూర్తిస్థాయిలో అండగా నిలవాలని ఆయన కోరారు.

పోలీసుల భారీ బందోబస్తు

మాజీ సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి రావడంతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దు నుంచి ప్రత్యేక కాన్వాయ్‌తో పాటు రోడ్ల వెంట పోలీసులను ఉంచారు. మండల కేంద్రాలతో పాటు గ్రామాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిజామాబాద్ వరకు సక్రమంగా వచ్చే విధంగా బందోబస్తును ఏర్పాటు చేశారు. రోడ్‌షోలో కూడా ఎలాంటి వివాదాలు తలెత్తకుండా భారీగా పోలీసులు మొహరించారు. ఈ రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, రాజ్య సభ్యు డ ం కేఆర్ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్త, జీవన్‌రెడ్డి, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అయేషా ఫాతిమా, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మేయర్ దండు నీతూకిరణ్, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌తో పాటు ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందూరు.. గులాబీమయం

సుభాష్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రాకతో ఇందూరు గులాబీమయమైంది. సోమవారం సాయంత్రం కేసీఆర్ జగిత్యాల నుంచి నగరానికి చేరుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం తొలిసారి కేసీఆర్ నిజామాబాద్ రావడంతో మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యకర్తలు రోడ్‌షో మొత్తం జై కేసీఆర్, జై బీఆర్‌ఎస్, జై తెలంగాణ అంటూ.. నినాదాలతో హోరెత్తించారు. బైపాస్ రోడ్డు నుంచి కంఠేశ్వర్ రైల్వే కమాన్ వద్ద పెద్ద ఎత్తున మహిళలు కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ పార్టీల జెండాలు ఊపుతూ నృత్యాలు చేస్తూ రోడ్డు పొడవునా స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సులోంచే కార్యకర్తలకు అభివాదం చేశారు. జగిత్యాల నుంచి జిల్లా సరిహద్దులో కమ్మర్‌పల్లికి చేరుకోగానే పార్టీ నేతలు ఆయనకు పూలతో ఘన స్వాగతం పలికారు.

కేసీఆర్ రోడ్ షో సాగిందిలా..

- రాత్రి 8 గంటలకు నిజామాబాద్‌కు చేరుకున్న కేసీఆర్
- రాత్రి 8.05 గంటలకు కంఠేశ్వర్ బైపాస్ వద్ద కేసీఆర్‌కు మహిళల ఘన స్వాగతం
- రాత్రి 8.10 గంటలకు ఎన్టీఆర్ చౌరస్తాకు చేరుకున్న కేసీఆర్
- రాత్రి 8.11 గంటలకు నుంచి 8.39 గంటలవరకు కేసీఆర్ రోడ్‌షో
- 8.41 బస్సు రూఫ్‌టాప్‌కు చేరుకున్న కేసీఆర్
- 8.42 గంటలకు కేసీఆర్ ప్రసంగం షురూ
- రాత్రి 9.05 గంటలకు ప్రసంగం ముగించిన కేసీఆర్
- రాత్రి 9.10 గంటలకు రాత్రి బసకు బయల్దేరిన కేసీఆర్

• కమ్మర్‌పల్లిలో మంగళహారతులతో కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు





• భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

రైతులను మోసం చేసేలా అమిత్‌షా ప్రకటనలు

- సహకార రంగంలో చక్కెర ఫ్యాక్టరీలను నడిపించడం సాధ్యం కాదు
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యాక్టరీలను పునరుద్ధరించేందుకే ప్రభుత్వం రూ.43 కోట్లు విడుదల చేసింది
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి

నిజామాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజాం చక్కెర ఫ్యాక్టరీలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మరోసారి రైతులను మోసం చేసే విధంగా ప్రకటనలు చేశారని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. భీంగల్, నడికుడ, మెట్‌పల్లిలో సోమవారం ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ, బీజేపీ మిత్రపక్షంగా ఉన్నప్పుడే నిజాం చక్కెర కర్మాగారాల్లో 51శాతం వాటాను విక్రయించారని ఆయన అన్నారు. ప్రైవేటు రంగంలో కొనసాగుతున్న ఈ ఫ్యాక్టరీలను 2015లో పూర్తిగా మూసివేశారని అన్నారు. అప్పుడు ఎంపీగా ఉన్న కవిత పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి ప్రజలను మోసం చేసే విధంగా కో ఆపరేటివ్ విధానంలో తెరిపిస్తామని ప్రకటించారన్నారు. సహకార రంగంలో ప్రారంభించడం సాధ్యం కాదన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు శాసనసభ, మండలిలో ఈ ఫ్యాక్టరీలపై లేవనెత్తామన్నారు. ఆయన కూడా సహకార రంగంలో ప్రారంభిస్తామని చెప్పిన రైతులపై భారం పడుతుందని తాము అన్నామన్నారు. ప్రభుత్వం తమ బాధ్యతల నుంచి తప్పించుకునేందుకే సహకార రంగాన్ని కేంద్రం ముందుకు తీసుకువచ్చిందన్నారు. ఇంతకాలం ఎదురు చూసిన రైతులకు సహకార రంగంలో ప్రారంభించడానికేనని ఆయన ప్రశ్నించారు. చక్కెర కర్మాగారాల కోసం మాజీ ఎమ్మెల్యే కొమురెడ్డి రాములు ఏడాది పాటు దీక్ష చేశారని అన్నారు. జువ్వాడి కృష్ణారావు పాదయాత్ర చేశారన్నారు. రైతుల కోసమే సీఎం రేవంత్‌రెడ్డి చక్కెర కర్మాగారాలను పునఃప్రారంభించేందుకు నిర్ణయించామన్నారు. మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి రైతుల సలహాలు, సూచనలు తీసుకున్నారన్నారు. తనఖా పెట్టిన ఆస్తులను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద విడిపించేందుకే ఈ ఫ్యాక్టరీల కోసం 43 కోట్ల రూపాయలను విడుదల చేశారన్నారు. ఇది కాంగ్రెస్ నిబద్ధతకు నిదర్శనమన్నారు. వచ్చే సంవత్సరం డిసెంబర్ నాటికి క్రషింగ్‌ను ప్రారంభిస్తామన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీల కోసం 1000 కోట్ల రూపాయలైనా ఇచ్చేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. రాహుల్‌గాంధీ కులగణన చేపట్టి రిజర్వేషన్‌ను పెంచేందుకు కృషి చేస్తుంటే బీజేపీ నేతలు అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా..

ఆర్మూర్‌రూరల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రోజువారి కూలీ రూ.400 పెంచి కూలీలకు ప్రతీఏటా రూ.40వేలు వేతనం అందేలా కృషి చేస్తామన్నారు. అంతేగాకుండా వేసవిలో రోజుకు 35శాతం అదనంగా బోనస్ చెల్లిస్తామన్నారు. బీజేపీ ఎంపీ అర్వింద్ ఏనాడైన ఉపాధి హామీ కూలీల సమస్యలను పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. తనను ఎం పీ గా గెలిపిస్తే అందరికి అందుబాటులో ఉండి సేవ చేస్తానని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన పూర్తిగా అవినీతిమయం..

భీమ్‌గల్ రూరల్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన పూర్తిగా అవినీతి మయమైందని, ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మారాయని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం భీమ్‌గల్, బడాభీమ్‌గల్ గ్రామాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌తో కలిసి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎంపీగా గెలిచిన వెంటనే ప్యాకేజీ 21 ద్వారా రైతులకు సాగునీరు అందించే విధంగా గ్రామాల్లోని ప్రతి చెరువును నిండు కుండలా నింపే బాధ్యత తానే తీసుకుంటున్నానని అన్నారు. భీమ్‌గల్ బస్ డిపో ఓట్ల కోసమే తెరిపించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మమ అనిపించారని అన్నారు. 50 బస్సులతో డిపోను పునఃప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. భీమ్‌గల్ మండల ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా బాల్కొండ నియోజక ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఉన్నాడని ఎటువంటి సమస్యలు ఉన్నా తీరుస్తాడని తెలిపారు. బడాభీమ్‌గల్ గ్రామంలో సుమారు 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

• రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మే 6: పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో సోమవారం సాధారణ పరిశీలకులు ఎలీస్ వజ్ హర్ సమక్షంలో అదనపు కంట్రోల్ యూనిట్ల రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వివి ధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల సమక్షంలో ప్రక్రియను పూర్తి చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్, బోధన్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అదనంగా 15 చొప్పున, బాల్కొండకు 40, నిజామాబాద్ అర్బన్‌కు 35, నిజామాబాద్ రూరల్‌కు 20 కంట్రోల్ యూనిట్లను అందుబాటులో ఉం చడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అదనపు కంట్రోల్ యూనిట్లు సెక్టోరియల్ అధికారుల వద్ద రిజర్వులో ఉంచడం జరుగుతుందని పోలింగ్ సమయంలో ఎక్కడైనా ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే నిమిషాల వ్యవధిలోనే సెక్టోరియల్ అధికారులు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు చేరుకొని రిజర్వులో ఉండే కంట్రోల్ యూనిట్లను సమకూరుస్తారన్నారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి..

ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై సోమవారం కలెక్టర్ సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ముఖ్యంగా వేసవి తీవ్రత దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల కోసం నీడను అందించేలా టెంట్లు, షామియాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడ కూడా ఓటర్లు, పోలింగ్ సిబ్బందిగానీ వడదెబ్బ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు, వలంటీర్లకు, ఆశావర్కర్లకు కూడా టెంట్లు ఉండేలా చూడాలన్నారుతాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పోలింగ్ నిర్వహణకు అవసరమైన టేబుళ్లు, ఇతర సా మగ్రి ఉండాలన్నారు. ర్యాంపులు, వీల్‌చైర్ లు సరిచూసుకోవాలని చివరి నిమిషం లో ఇబ్బందులు పడకుండా అన్ని సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. ఓటరు సమాచార స్లిప్పులు మంగళవారం నాటికి వంద శాతం పూర్తి చేయాలన్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆకట్టుకునేలా ఆకర్షనీయంగా తీర్చిదిద్దాలని ఎక్కడ కూడా చిన్న పొరపాట్లు కూడా తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.



• నిర్మాణంలో ఉన్న మాధవనగర్ రైల్వే వంతెన

నిలిచిన ఆర్వోబీ పనులు

• వాహనదారులకు తప్పని ఇక్కట్లు

డిచ్‌పల్లి, మే 6: మండలంలోని మాధవనగర్ రైల్వే వంతెన నిర్మాణ పనులు నెల రోజులుగా నిలిచి పోయాయి. నిర్మాణ పనులు ప్రారంభమై ఏడాదిన్నర గడుస్తున్నా రెండు అడుగులు ముందుకు, మూడు అడుగుల వెనక్కి అన్న చందంగా పనులు కొనసాగుతున్నాయి. వంతెన నిర్మాణం 42 పిల్లర్లతో చేపడుతున్నారు. తాత్కాలిక రోడ్డును వేయడంతో వాహన చోదకులు దానిపైనే రాకపోకలు కొనసాగిస్తున్నారు. భారీ వాహనాలను బైపాస్ రోడ్డు గుండా మళ్లించిన విషయం తెలిసిందే. వంతెన నిర్మాణానికి ఇంత వరకు రూ.30కోట్లు ఖర్చు అయినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కానీ ఇప్పటి వరకు రూ.15 కోట్లు మాత్రమే విడుదల కావడంతో గుత్తేదారుల పనులను నిలిపివేసినట్లు తెలిసింది. అయితే రైల్వే అధికారులు మాత్రం ప్రస్తుతం ఎన్నికల కోడ్ వల్ల నిధుల విడుదలలో జాప్యం జరుగుతుందని చెబుతున్నారు. కాగా, నిర్మాణ పనులు నిలిచిపోవడంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

సీఎం, మాజీ సీఎంల మోసపూరిత మాటలు నమ్మొద్దు : అర్వింద్

ఎడపల్లి, మే 6: రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ వారి భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్‌లు పచ్చి మోసకారులని, వారి అబద్ధపు మాటలను ప్రజలు నమ్మ వద్దని బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో కార్నర్ సమావేశంలో మాట్లాడారు. దేశాభివృద్ధి కోసం ప్రతిక్షణం పని చేస్తున్న మోదీని హ్యాట్రిక్ ప్రధానిగా చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. తాము గెలిచిన నెల రోజుల్లో చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. ఎడపల్లి మండలంలోని రూర్బన్ ప్రాంతంలో 30 కోట్ల రూపాయల తో అభివృద్ధి పనులు చేశామన్నారు. 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారి టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం..

ఆర్మూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం రైతులు, మహిళల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ అన్నారు. మండలంలోని అంకాపూర్‌లో సోమవారం చాయ్‌పే చర్చ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోదీని బలపర్చాలని ఎంపీ అర్వింద్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్ పాల్గొన్నారు.

అవినీతి కాంగ్రెస్‌ను ఓడించండి..

నిజామాబాద్ రూరల్: ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రూరల్ మండలం గుండారంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను గద్దెదించాలని, బీజేపీకి అధికారం ఇవ్వాలన్నారు. ఎంపీగా నీతి, నిజాయితీగా పనిచేశానని తనపై ఒక్క అవినీతి ఆరోపణలు కూడా లేవని తెలిపారు. మాజీ ఎంపీ కవిత అవినీతి చేసి జైలుపాలయిన విషయం గుర్తుచేసుకోవాలని సూచించారు. తనను రెండోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని అర్వింద్ కోరారు. ఈ కార్యక్రమానికి గుండారం, మల్కాపూర్, జలాల్‌పూర్, పాల్ద, తిర్మన్‌పల్లి, శ్రీనగర్, ఆకుల కొండూరు, కాలూరు, ఖానాపూర్, సారంగపూర్‌ల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. ఇందులో బీజేపీ నేతలు దినేష్ కులాచారి, పద్మారెడ్డి, జగన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులున్నారు.

వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్స అందించాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్



నవీపేటలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

నవీపేట,మే6: రాష్ట్రంతో పాటు జిల్లాలో సైతం ఎండలు అధికంగా ఉన్నందున వడదెబ్బ తగిలిన వారికి వైద్య సిబ్బంది వెంటనే ప్రథమ చికిత్స అందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అన్ని సబ్ సెంటర్‌లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కోరారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలకు ఇచ్చే టీకాలను ఉదయం పూటే అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్‌లు కావ్య, సామ్రాట్ యాదవ్, హెచ్‌ఈవో వెంకటేశ్వర్ రావు, సూపర్‌వైజర్లు కిషన్, ప్రభాకర్, సిబ్బంది ప్రేమలత, పుష్ప, రాణి, తదితరులున్నారు.

కేసీఆర్ సభకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు



తరలివచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

మోపాల్, మే 6: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌కు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు సోమవారం సాయంత్రం మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల నుండి బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున బస్సుల్లో తరలించారు. ఉదయం ఆ పార్టీ నాయకులు గ్రామాల్లోకి వెళ్లి కేసీఆర్ సభకు తరలిరావాలని పార్టీ అధ్యక్షుడు మోచ్చ శ్రీను, నాయకులు శ్రీనివాస్‌రావు, ముత్యంరెడ్డి, భూమన్నలు ప్రజలను కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు.

కేసీఆర్ సభకు భారీగా తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

ధర్పల్లి: బీఆర్‌ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరిలారు. మధ్యాహ్నం నుంచే మండలంలోని ఆయా గ్రామాల నుంచి బస్సుల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు సోమవారం జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున్, మాజీ చైర్మన్ కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

వర్నివర్ని,మే6: వర్ని మండలం సైద్‌పూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మాజీ ఎంపీపీ భజ్యా నాయక్ ఆధ్వర్యంలో మజ్జిగ, అరంటి పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాస రావు, పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి, వర్ని ఎంపీపీ లక్ష్మి వీర్రాజు, ఎస్‌ఎన్ పురం తాజా మాజీ సర్పంచ్ నాగమణి వీర్రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు కల్పించిందన్నారు. 200యూనిట్ల కరెంటు ఫ్రీ ఇస్తుందన్నారు. పది లక్షల ఆరోగ్య పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత మిగతా పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ మాజీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ భారీ, ప్రశాంత్ కుమార్, నేమాని రఘు, అవెజ్, నిఖిల్, శ్రీరామ్, హరి, శివరాం, హరిచంద్,బాబు, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు దుక్కులు-ప్రాముఖ్యతపై అవగాహన

డిచ్‌పల్లి, మే 6: మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో నేడు రైతులకు దుక్కులు-ప్రాముఖ్యత అనే అంశం పైన వీడియో కాన్ఫరెన్స్ ద్వార హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు అవగహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిచ్‌పల్లి వ్యవసాయాధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కావున రైతులు కాన్ఫరెన్స్‌కు హాజరై అవగహన పొందలన్నారు.

'వాహనాలను జాగ్రత్తగా ఉంచుకోవాలి'

బోధన్ రూరల్, మే 6: ప్రజలు తమ సొంత కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను జాగ్రత్తగా పార్కింగ్ చేసుకుని ఉంచుకోవాలని పట్టణ సీఐ వీరయ్య అన్నారు. వాహనదారులు రాత్రిపూట తమ వాహనాలకు తాళాలు వేసి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. సోమవారం అర్ధరాత్రి పట్టణంలోని రంగార్‌గల్లీలో ఓ ఆటో, ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు కాలిపోయిన సంఘటన చోటు చేసుకుందన్నారు. కావున వాహనదారులు తమ వాహనాలను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. కాలిన ఘటనపై సీసీ పుటేజీల ద్వారా అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

చివరి ఆయకట్టుకు అందని సాగు నీరు



గుత్ప పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న స్వర్గీయ మాజీ సీఎం వైఎస్సార్ (ఫైల్‌ఫొటో)



గుత్ప లిఫ్ట్ మొదటి పంపుహౌస్



గ్రావిటీ కెనాల్‌లోని చెట్లు

- గుత్పకు పదహారేళ్లు పూర్తయిన ఫలితం అంతంతే
- సీసీ లైనింగ్‌కు నోచుకోని గ్రావిటీ కెనాల్
- ఫలించని అధికారుల భగీరథ ప్రయత్నం
- ఆందోళనలో పథకం పరిధి రైతులు
- ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వానికి వేడుకోలు

నందిపేట, మే 6 అప్పటి ఉమ్మడి రాష్ట్రప్రభుత్వం జలయజ్ఞం పేరుతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకానికి పదహారేళ్లు నిండాయి. అయినప్పటికీ ఫలితం అంతంత మాత్రమే. గోదావరి జలాల ద్వారా నిజాంసాగర్ చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో రూ.204కోట్ల వ్యయంతో చేట్టిన పథకాన్ని స్వర్గీయ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి 2008 మార్చి 18న జాతికి అంకితం చేశారు. నాలుగు, ఐదు సంవత్సరాల పాటు రెండు పంటలకు సాగు నీరు అందించిన ప్రాజెక్టు నేడు దీన స్థితిలో ఉంది. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికి గ్రావిటీ కెనాల్ పూర్తి స్థాయి సీసీ లైనింగ్‌కు నోచుకోలేదు. నందిపేట ఆయకట్టుకు సాగు నీరు అందించాలని నిర్మించిన రెండు ప్రత్యేక పైపులైన్లలో ఒకటి పనికిరాకుండా పోయింది. దీంతో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం కలగానే ఉండిపోయింది. సుమారు 5వేల ఎకరాలు బీడు గా మారాయి. ఈసంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడినప్పటికి సీసీ లైనింగ్ లేక, పిచ్చిమొక్కలతో నిండిన గ్రావిటీ కెనాల్ ద్వారానే నీటి సరఫరా జరిగింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో ఎకరాలకు అధికారులు సాగు నీరు అందించలేకపోయారు. ఈరబీ సీజన్‌లో మాత్రం అధికారులు భగీరథ ప్రయత్నమే చేశారు.

● ముందుమాట

నందిపేట మండలంలోని ఉమ్మెడ పాత గ్రామం శివారులోని గోదావరి ఒడ్డున ఎనిదేళ్ల క్రిందట ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా రు.204 కోట్లతో అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. ఆరు మండలాల్లోని(నందిపేట,మాక్లూర్,ఆర్మూర్,జక్రాన్‌పల్లి,వేల్పూర్, బాల్కొండ) 38వేల 792 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రెండు పంపౌస్‌లు ఏర్పాటు చేశారు. ఒకటి ఉమ్మెడలో మరోకటి మాక్లూర్ మండలం లక్ష్మాపూర్‌లో. బజార్‌కొత్తూర్ శివారులో నుంచి మాక్లూర్ మండ లం ధర్మోర చెరువువరకు 9కిలో మీటర్ల పొడవుతో గ్రావిటీ కెనాల్‌ను నిర్మించారు. మొదటి పంపు హౌస్ ద్వారా నాలుగు మోటార్లతో కెనాల్ ద్వారా ధర్మోర చెరువులోకి నీరువెళితేనే నిజాంసాగర్ చివరి ఆయకట్టువరకు సాగునీరు సమృద్ధిగా అందుతుంది. కానీ నాలుగు మోటార్లతో నీటిని వదిలితే గ్రావిటీకెనాల్ కోతకు గురవుతోంది. దీంతోఅధికారులు రెండు, మూడు మోటార్లతోనే సరిపెట్టుతున్నారు. సారునీరు అందని మిగతా మండలాల రైతులు ఆందోళనలకు దిగారు. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చారు.

● అసంపూర్తిగా గ్రావిటీ కెనాల్ సీసీ లైనింగ్

రైతు నాయకుల ఒత్తిడి మేరకు 2011లో సిమెంట్ లైనింగ్ పనులకు రు.6కోట్లు మంజూరు చేసింది ప్రభుత్వం. ధరలు పెరగడంతో రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా కంపెనీలు ముందుకు రాలేవు. మళ్లీ ప్రభుత్వం రూ.7కోట్లు మంజూరు చేసింది. తాడూరి బాలేశ్వర్‌రెడ్డి అండ్ కన్‌స్ట్రక్షన్ (టిబిఆర్)కంపెనీ పనులు దక్కించు కుంది. వర్షాలతో వాతావరణం అనుకూలించక, ఖరీఫ్, రబీకి నీరు అందించడంతో సిమెంట్ లైనింగ్ పనులు ఆలస్యంగా మొదలైనాయి. రు.3 కోట్ల విలువచేసే పనులు చేస్తే అధికారులు మాత్రం రు.1.30కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా డబ్బుల విషయమై అధికారులను సంప్రదిస్తే బడ్జెట్ అయిపోయిందని చేతులేత్తేశారు. దీంతో సదరు కంపెనీ పనులను మధ్యలోనే నిలిపేసింది. తర్వాత డెలివరీ సిస్టర్న్ వద్ద అలాగే 133/11కెవి సబ్ స్టేషన్ దగ్గర కొద్దిపాటి సిమెంట్ లైనింగ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయినా కొత్త ప్రభుత్వం పరిపాలిస్తున్నప్పటికి ఈ పథకంను పట్టించుకోక పోవడంపై రైతులు సర్వాత్రా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇంతపెద్ద పథకంను అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడంపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

● ఇదీ చరిత్ర

అంక్సాపూర్ అశోక్‌రెడ్డి అనే రైతు గుత్ప లిఫ్ట్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ 1993, అక్టోబర్ 2న ఉద్యమం చేపట్టారు. ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు. అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం 1999, జూన్ 25న లిఫ్ట్ మంజూరు చేస్తూ జీవో 120ని జారీ చేసింది. అదే తడవుగా మరుసటి రోజున అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రతి పక్షాలు పలు మార్లు శిలాఫలకానికి తద్దినాలు నిర్వహించారు. గుత్ప సాధన సమితి 2003, మే 21న అమరణ నిరాహర దీక్ష చేపట్టింది. స్పందించిన ప్రభుత్వం మే 24న సాంకేతిక మంత్రిగా ఉన్న నేరేళ్ల ఆంజనేయులు జోక్యంతో నిరాహర దీక్షను విరమింప జేసింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో విద్యా శాఖ మంత్రిగా ఉన్న మండవ వెంకటేశ్వర్ రావు 2004లో గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో 2005, ఏప్రిల్ 3న రాష్ట్ర ముఖ్యంమత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుత్ప లిఫ్ట్ పనులను ప్రారంభించారు. అక్కడే రాష్ట్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పైపులైన్ డిజైనింగ్, సిమెంట్ కోటింగ్‌లపై చర్చించి పూర్తి స్థాయి ఆదేశాలు జారీ చేశారు. పనులు దక్కించుకున్న పలు కంపెనీలు ఆడపాదడపా పనులు పూర్తి చేయగా 2008 మార్చి 18న నీటి విడుదల చేసి స్వర్గీయ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి గుత్ప లిఫ్ట్‌ను జాతీకి అంకితం చేశారు. అప్పటి నుంచి రెండు పంటలకు సాగు నీరు అందించిన అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం నేడు ఆశించిన స్థాయిలో సాగు నీరు అందించడం లేదు.

పథకం వివరాలు:

ఆయకట్టు	: 38, 792 ఎకరాలు
అంచనా వ్యయం	: రూ.204కోట్లు
లబ్ధి మండలాలు	:నందిపేట, మాక్లూర్, ఆర్మూర్, బాల్కొండ, వేల్పూర్, జక్రాన్‌పల్లి
నీటి పరిమాణం	: 540 క్యూసెక్కులు
నీటి ఎత్తు	: 69.32 మీటర్లు
పైపులైన్	: 11.29కి.మీ
గ్రావిటీ కెనాల్	: 9.085కి.మీ
పంపుహౌస్‌లు	: రెండు
మోటార్లు	:మొదటి పంపుహౌస్ వద్ద 2250 కిలోవాట్లు సామర్థ్యం గలవి నాలుగు. రెండవ పంపుహౌస్ వద్ద 1725 కిలోవాట్లు సామర్థ్యం గలవి నాలుగు(వర్టికల్ టర్బన్ రకం)
విద్యుత్ సామర్థ్యం	: 18 మెగావాట్లు.(0.41మిలియన్ యూనిట్లు) డిస్ట్రిబ్యూషన్- నిజాంసాగర్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ 74 నుంచి డి.82 వరకు

పింఛన్లు రాక ఆందోళన చెందుతున్న మార్కెట్ కమిటీ పెన్షనర్లు



మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఖిల్లా, మే 6: ఉమ్మడి జిల్లాలో (17) వ్యవసాయ మార్కెట్ కమిటీలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన దాదాపు 200 మందికి పెన్షన్లు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శికి వ్యవసాయ మార్కెట్ కమి పెన్షనర్స్ టీఅసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. వీరిలో చాలా మంది వృద్ధ వయస్సులో ప్యామిలీ పెన్షనర్లు ఉన్నారని ఆ వినతిపత్రంలో తెలిపారు. వీరియొక్క పెన్షన్‌కు సంబంధించిన బిల్లులను వారి వారి మార్కెట్ కమిటీల కార్యదర్శులు తయారు చేసి చెక్ రూపేన డీటీవో-ఏటీవో, ఎస్టీవోలకు సమర్పించడం జరిగిందన్నారు. అటువంటి చెక్కులను తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిన పిదప సంబంధిత పెన్షనర్ల ఖాతా జమ చేయడం జరుగుతుంది. కానీ గత మూడు నాలుగు నెలల నుంచి తెలంగాణ ప్రభుత్వపు ఆర్థిక శాఖ ఆమోదం తెలపనందున సకాలంలో పెన్షన్స్ రానందున వృద్ధాప్య పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరు పూర్తిగా పెన్షన్‌పైనే ఆధారపడి ఉన్నారని అన్నారు. వీరితో పాటు సర్వీసులో ఉన్న మార్కెట్ కమిటీ ఉద్యోగులకు కూడా జీతభత్యాలు అందక ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న చెక్కులను ఆమోదం తెలిపి ఇకముందు ప్రభుత్వ పెన్షనర్లకు, ఉద్యోగస్తులకు చెల్లిస్తున్న పద్ధతిలో మార్కెట్ కమిటీ పెన్షనర్లకు, ఉద్యోగస్తులకు కూడా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో అధ్యక్షుడు బన్సీలాల్, గౌరవ అధ్యక్షుడు టి.గంగాదాస్, కార్యదర్శి వి.రాజేందర్, కోశాధికారి ఎస్.ప్రసాద్‌లు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



నాగయ్య మృతదేహం

కోటగిరి,మే6: కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో వన్నెల నాగయ్య(48)అనే వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం నాగయ్య అతని భార్య లక్ష్మికి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. సోమవారం ఉదయం ఇంట్లో శవమై కనిపించాడు. నాగయ్య ఒంటిపై తీవ్ర గాయాలు ఉండటంతో పాటు ఊపిరాడకుండా అతనిని హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తన అన్ననాగయ్య మృతిపై వదిన లక్ష్మితో పాటు మరికొందరిపై అనుమానం ఉన్నట్లు అతని తమ్ముడు సత్యం పోలీసులకు ఫిర్యాదుచేశారు.ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐసందీప్ తెలిపారు.

'భాషా పండితులకు సమాన పనికి సమాన వేతనం అందించాలి'



పీఆర్‌సీ చైర్మన్ ను కలిసిన ఆర్‌యూపీపీటీ సభ్యులు

డిచ్‌పల్లి,మే 6: నూతన పీఆర్సీలో భాషా పండితులకు న్యాయం చేయాలని అప్పర్ ప్రైమర్ మరియు హైస్కూల్‌లో బోధిస్తున్న భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ వేతనం అందించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ల తో పాటు సభ్యులు పీఆర్‌సీ చైర్మన్ శివశంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అబ్దుల్లా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కేవలం 150 రూపాయల అదనం వేతనంతో భాషా పండితులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని సమాన పనికి సమాన వేతనం వర్తింప జేయాలని కోరారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని, 44శాతం పిట్మెంట్ సిఫారస్ చేయాలని ఉపాధ్యాయులకు ఇస్తున్న ఆరు ఇయర్స్ లీవ్‌లను 15కు పెంచాలని కోరారు. ఈ విషయాలపై కమిషన్ చైర్మన్ సానుకూలంగా వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుల్లపల్లి తిరుమల, కాంతి కృష్ణ, ఘనపురం దేవేందర్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, మే 6:నగరంలోని గంగాస్థాన్‌లో వాన రం మృతి చెందడంతో అక్కడ ఉండే స్థానికులు సమాచారం ఇవ్వడంతో విశ్వహిందూ పరిషత్ సహ కార్యదర్శి దాత్రిక రమేష్ ఆధ్వ ర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. సారంగపూర్ లోని గోశాలలో శాస్త్ర యుక్తంగా వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాకేత్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యంచ లిఫ్ట్ చైర్మన్‌గా బాపురావు ఏకగ్రీవ ఎన్నిక

నవీపేట,మే6: మండలంలోని యంచ ఎత్తిపోతల పథకం చైర్మన్‌గా సింధే బాపురావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం యంచలో జరిగిన ఆయకట్టు రైతుల సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. కమిటీ పూర్తి స్థాయి సభ్యులను త్వరలోనే ఎన్నుకోవడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. లిఫ్ట్ పాలకవర్గం పదవి కాలం ఐదు సంవత్సరాలు ఉంటుంది.

'గురుకుల విద్యార్థినులు అన్ని రంగాలలో రాణించాలి'

బోధన్‌రూరల్,మే6: ప్రభుత్వ పాఠశాలతో పాటు గురుకులాలలో చదివే విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజరి గంగారాం అన్నారు. సోమవారం బోధన్ పట్టణానికి చెందిన సాత్విక అనే విద్యార్థిని కామారెడ్డి జిల్లా జంగంపల్లి గురుకుల పాఠశాలలో పదవ తరగతిలో 10/10జీపీఏ సాధించడంతో నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలతో పాటు గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బారావు, రవి శంకర్ గౌడ్, అశోక్, గౌడ్, ప్రవీణ్ జాదవ్ నాయక్, దప్పుల చంద్రయ్య, సాగర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.70,900	రూ.65,400	రూ.845

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (1.35, 7.45)
: టిల్లు స్క్వేర్ (4.30)
: బాక్ (10.40)

స్క్రీన్-2 : ద పాల్ గాయ్ (ఇంగ్లీష్) (11.00, 1.50, 7.20, 10.10)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (4.40)

స్క్రీన్-3 : ప్రసన్నవదనం (1.10, 4.15, 10.10)
: శబరి (7.20)

స్క్రీన్-4 : ప్రసన్నవదనం (1.10, 7.20)
: మంజుమ్మల్ బాయ్స్ (4.20, 10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (10.50, 1.45, 4.40, 7.35, 10.30)

స్క్రీన్-2 : బాక్ (10.40)
: ప్రసన్నవదనం (1.40, 10.30)
: మంజుమ్మల్ బాయ్స్ (4.45, 7.40)

స్క్రీన్-3 : బాక్ (1.40, 4.35, 7.30, 10.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

లలితమహాల్ : వకీల్ సాబ్ (11.15, 2.15, 6.15 9.15)

నటరాజ్ : బాక్ (11.15, 2.15, 6.15 9.15)

విజయ్ : ఆ ఒక్కటీ అడక్కు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్